క్లుప్తంగా

300 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ

ఏన్కూరు: మండలంలో ఇటీవల కురిసిన అకాలవర్షానికి సుమారు 300 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. మండలంలోని గార్లఒడ్డులో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ దెబ్బతిన్న పంటల సర్వే మూడు రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. రైతుబంధు మండల కన్వీనర్ మేడ ధర్మారావు, ఏఈఓలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రంజాన్ కిట్లు పంపిణీ

సత్తుపల్లి: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు మొదలైన రోజే దివ్యాంగులకు రంజాన్ నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేయటం అభినందనీయమని అమ్మ ఆషాఖాన్ ట్రస్ట్ సేవలను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కొనియాడారు. శుక్రవారం సత్తుపల్లిలో దివ్యాంగులకు రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పఠాన్ ఆషాఖాన్, పఠాన్ లాల్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎస్‌కె రఫీ, మట్టా ప్రసాద్, వేముపల్లి మధు, కొత్తూరు ఉమా, ఎస్‌కె ఛాంద్‌పాషా, చల్లగుండ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

మండలంలో విజయబాయి పర్యటన

కారేపల్లి: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అనుచరురాలు విజయబాయి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న, ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్‌లు అజ్మీరా నరేష్, ఆదెర్ల స్రవంతి, ఎంపీటీసీ ఇమ్మడి రమాదేవితో పాటు నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, ఎం.డీ.హనీఫ్, భూక్యా మాన్‌సింగ్, ఆదెర్ల ఉపేందర్, లకావత్ గోపీనాథ్, బానోతు వీరభద్రం పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు 200 రోజులకు పెంచాలి

కొణిజర్ల: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ ఉపాధిహామీ పథకం పనులు 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మికసంఘం, సీపీఐ జిల్లా నాయకుడు యర్రా బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వేములకొండ రమేష్, వెంకన్న, సుదర్శన్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్ దేవదానం

ఎర్రుపాలెం: ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మధిర డిపో మేనేజర్ దేవదానం కోరారు. శుక్రవారం మండలంలోని మీనవోలు సెంటర్‌లో ప్రజల వద్దకు ఆర్టీసీ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కల్పిస్తున్న రాయితీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆర్టీసీ అందిస్తున్న రాయితీలను వివరించారు. కార్యక్రమంలో కేవీరెడ్డి, జానీ ఉన్నారు.

బాల్య స్నేహితుడికి ఆర్థిక సాయం



రిక్షా అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వైరా: ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వైరాకు చెందిన గోవిందరావుకు బాల్య స్నేహితులు రూ.20 వేలు విలువ చేసే రిక్షాను అందించారు. గోవిందరావు రిక్షా కార్మికుడిగా పనిచేస్తూ.. తన రిక్షాని బాగు చేయించుకొనే స్థోమత లేదు. దీంతో అతనితో పాటు చదువుకున్న కొందరు మిత్రులు కొమిరిశెట్టి శ్రీధర్, మిట్టపల్లి నాగేశ్వరరావు(నాగి), రాయల కృష్ణారావు, జనార్దన్, జగన్, రాజా, రాజారావు, లక్ష్మణరావు, రాజారావు, శేషగిరి, జనార్దన్, హుస్సేన్ తదితరులు కొత్త రిక్షాను మిత్రుడికి అందించారు.

ఉత్తమ సేవలకు జాతీయ అవార్డులు

గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న పనులు, సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో ఉత్తమ పురస్కారాలు అందజేసింది. ఆయా పంచాయతీల్లో చేపట్టిన వివిధ పనులు, సేవలపై ఆన్‌లైన్లో వివరాలు పంపించగా.. పోస్టల్ ద్వారా పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పేరిట పురస్కారాలు ప్రశంసాపత్రాలు పంపించింది. ఈ మేరకు శుక్రవారం ఆయా మండల కార్యాలయాల్లోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీలు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. **– సాక్షి నెట్‌వర్క్**



సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలో ఉత్తమ సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



చింతకాని: గ్రామసర్పంచ్‌లకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు



ముదిగొండ: గంధసిరి పంచాయతీ కార్యదర్శి నరేష్, సర్పంచ్ సీతమ్మలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం



పెనుబల్లి: చౌడవరం సర్పంచ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

గంగారం పీహెచ్‌సీకి అవార్డులు..



కల్లూరు: ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఆశ్రిఫ్

సత్తుపల్లిరూరల్: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా గంగారం పీహెచ్‌సీ క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమంలో అందించిన సేవలకు రెండు ఉత్తమ అవార్డులు వచ్చాయి. ఉత్తమ టీబీ సూపర్‌వైజర్‌గా ఎం.సురేష్, ఉత్తమ నోడల్ పర్సన్‌గా పి.నర్సింహారావులకు అవార్డులు ఉన్నతాధికారులు అవార్డులు ప్రకటించారు. ఈ సందర్భంగా గంగారం పీహెచ్‌సీ వైద్యులు అవినాష్, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డు అందుకున్న ఆశ్రిఫ్..

కల్లూరు: ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో టీబీ విభాగంలో సేవలు అందించిన పలువురిని అభినందించి అవార్డులు అందచేశారు. కల్లూరు ప్రభుత్వాసుపత్రిలో రక్త పరీక్ష నిపుణులుగా పని చేస్తున్న షేక్ ఆశ్రిఫ్‌కు ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డును ఖమ్మం జిల్లా టీబీ అధికారి డాక్టర్ సుబ్బారావు చేతుల మీదగా ప్రశంసా పత్రాని అందచేశారు. ఆశ్రిఫ్‌ను కల్లూరు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ నవ్యకాంత్, వైద్య సిబ్బంది అభినందించారు.

విద్యాభివృద్ధిని సాధించాలి

చింతకాని: విద్యార్థులు కష్టపడి చదువుతూ విద్యాభివృద్ధి సాధించాలని శ్రీ సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ దమ్మాలపాటి సుధాకర్ తెలిపారు. మండలంలోని పాతర్లపాడు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి సభ్యులు పరీక్ష ప్యాడ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటుగా దాతలు అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలని కోరారు.



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందిస్తున్న సుధాకర్

ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆలస్యం నర్సింహారావు, ఆదినారాయణ, గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన మాదిగల సంగ్రామ యాత్ర



మాదిగల సంగ్రామ మహా పాదయాత్ర చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని కోరుతూ చేపట్టిన మాదిగల సంగ్రామ మహాపాదయాత్ర శుక్రవారం రెండో రోజుకు చేరింది. సత్తుపల్లి పాత సెంటర్ నుంచి గౌరిగూడెం, రాజీవ్‌కాలనీ, రేజర్ల మీదుగా వేంసూరు మండలం లింగపాలెంకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా నాయకులు దారెల్లి వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ.. ఈ పాదయాత్ర ఏప్రిల్ 4న హైద్రాబాద్ చేరుకొని నగరాన్ని ముట్టడిస్తామన్నారు. ఇకనైనా కేంద్రం ఎస్సీ వర్గీకరణబిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు వెంకటేశ్వర్లు, యేసు, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీను, లక్ష్మణ్, అర్జున్, అశోక్, రాంబాబు, రాఘవ, మేరీ, సుగుణమ్మ పాల్గొన్నారు.

సొసైటీ ఇన్సూరెన్స్ చెక్కులు పంపిణీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి సొసైటీలో సభ్యత్వం ఉన్న బోయినపల్లి నాగేంద్రప్రసాద్, పర్సా సురేష్‌కుమార్‌లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి సొసైటీలో ఇన్సూరెన్స్ ఉండటంతో మృతుల నామినీ దారులకు ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున సొసైటీ అధ్యక్షుడు తుమ్మూరి ప్రసాద్ శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో రమేష్, కేశవరావు, శివన్నారాయణ, రాములు, విమల, సర్వేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో పంచాయతీ భవనం ప్రారంభం

ఎర్రుపాలెం: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో రూ.15లక్షల నిధులతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని శుక్రవారం స్థానిక ఎస్ఆర్ఐ, నిర్మాణ దాత వెన్నపూస శ్రీనివాసరెడ్డి, భవన నిర్మాణ స్థల దాత మాజీ సర్పంచ్ వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, స్థానిక సర్పంచ్ శీలం రాధమ్మతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత, ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణలు మాట్లాడుతూ.. పంచాయతీ భవన నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దాతలను శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ ప్రతిష్ఠ

పెనుబల్లి: మండలంలోని యడ్లబంజర్‌లో రామాలయ ప్రతిష్ఠ శుక్రవారం భక్తులకు కన్నుల విందుగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించి గ్రామంలో నాభిశిల ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సోమరాజు సీతారామారావు, వేణుబాబు, రామారావు, సుబ్బారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

చింతకాని/బోనకల్: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.10వేలు ప్రకటించడంతో శుక్రవారం కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతుబాంధవుడిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పర్సగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ పూర్ణయ్య, వైస్ ఎంపీపీ హనుమంతురావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ రత్నాకర్, జిల్లా సభ్యులు రమేష్, నాగులవంచ సొసైటీ చైర్మన్ శేషగిరిరావు, చింతకాని గ్రామసర్పంచ్ సుభద్ర, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, మండల రైతు బంధు కన్వీనర్ వేమూరి ప్రసాద్, నాయకులు శ్రీను, కొండ, మల్లికార్జున్, రవి, నాగేశ్వరరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



బోనకల్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నియామకం..

మధిర ఆత్మ కమిటీ చైర్మన్‌గా రామారావు..



గుర్రం రామారావు

మధిర: మధిర ఆత్మ కమిటీ చైర్మన్‌గా దెందుకూరు గ్రామానికి చెందిన గుర్రం రామారావుని నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన ముక్కుసూటితనాన్ని, నిజాయితీని, సమర్థతను గుర్తించిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ రామారావుని మధిర ఆత్మ కమిటీ చైర్మన్‌గా సూచించడంతో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆమోదించారు. శనివారం మధిర పర్యటనకు వస్తున్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సమక్షంలో ఆయనతోపాటు మరో 18 మంది డైరెక్టర్లు పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన గుర్రం రామారావుని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత దంపతులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

సత్తుపల్లి బార్ అధ్యక్షుడిగా శ్రీనివాస్..



శ్రీనివాసరావు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాలపాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బొర్రా వెంకట్రావ్‌లు ఎన్నికయ్యారు. శుక్రవారం సత్తుపల్లిలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పాలపాటి శ్రీనివాసరావు ప్రత్యర్థి అభ్యర్థిపై మూడు ఓట్లతో గెలిచాడు. కాగా ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన బొర్రా వెంకట్రావు ప్రత్యర్థి అభ్యర్థిపై 20 ఓట్లతో గెలిచాడు. అదే విధంగా ఉపాధ్యక్షుడిగా ఎం.సతీష్‌కుమార్‌బాబు, జాయింట్ సెక్రటరీగా వంకదారు రామకృష్ణ, క్రీడల సెక్రటరీగా జె.వెంకటనరేంద్ర, లైబ్రరి సెక్రటరీగా కె.సుదర్శన్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, మహిళా రిప్రజెంటేటీవ్‌గా కిరణ్‌రంజని, ఈసీ సభ్యులుగా ఎస్.విజయ్‌కుమార్, కె.కేశవరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జామే మసీదు అభివృద్ధి కమిటీ ఎన్నిక..

కారేపల్లి: కారేపల్లి జామే అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం కారేపల్లి మసీదులో జరిగిన సమావేశంలో ఎన్నికను నిర్వహించారు. జామే మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ గౌసుద్దీన్ ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు. కమిటీ సభ్యుడిగా ఎండీ ఆయస్, ఎండీ యాకూబ్‌సాబ్, షేక్ యాకూబ్ పాషా, షేక్ జాకీర్, షేక్ షఫీ, షేక్ అబ్దుల్ మతీన్, షేక్ షబ్బర్, సలహాదారులుగా షంషుద్దీన్, మహమ్మద్ యాకూబ్ పాషా లను ఎన్నుకున్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

సత్తుపల్లిటౌన్/ఏన్కూరు: ఈ నెల 25న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ చేపడుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఉడతనేని అప్పారావు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు నల్లమోతుల రమేష్ కోరారు. సత్తుపల్లిలోని స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో, ఏన్కూరులోని శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ ధర్నాకు నిరుద్యోగులు, బీజేపీ నాయకులు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. టీఎస్‌పీఎస్‌ఈ పోటీ పరీక్షల పేపర్ల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రెంటపల్లి నారాయణ, వేల్పుల వెంకన్న, బొల్లి వెంకటేశ్వర్లు, వజినేపల్లి దర్గయ్య, చల్లా రంగయ్య, నాయుడు రాఘవరావు, మండల, పట్టణ అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాసరావు, ఆచంట నాగస్వామి, రహ్మతుల్లా, నాగసురేందర్‌రెడ్డి, ఆంజనేయులు, కిరణ్ పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మధిర: పవిత్ర తపస్సు దినములలో భాగంగా బయ్యారం విచారణ గురువులు ఫాదర్ జూగుంట ప్రభాకర్ ఆధ్వర్యంలో దేశినేనిపాలెం ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం పరిశుద్ధ ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలో బయ్యారం విచారణ గ్రామాల ప్రజలు, దేశినేనిపాలెం సంఘ పెద్దలు, సంఘస్తులు, దీక్షాపరులు పాల్గొన్నారు.

బీజేపీ తీరు కుట్రపూరితం

సత్తుపల్లి: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖరు ఖండించారు. స్థానిక సంభానీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇదో చీకటి రోజుగా అభివర్ణించారు. రాహుల్ గాంధీపై కేంద్రం కుట్రపూరితంగా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసిందన్నారు. భవిష్యత్ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ పోటీ చేయకూడదనే దురుద్దేశ్యంతో బీజేపీ చేసిన కుట్ర బహిర్గతమైందని.. దీనిని దేశ ప్రజలందరు గుర్తించాలన్నారు. మోదీ తన పతనాన్ని తానే కొని తెచ్చుకుంటున్నారన్నారు. ఈ అరాచక పాలనకు రాబోయ్యే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..

ఎర్రుపాలెం: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని పార్లమెంట్ నుంచి బహిష్కరణ వేటు వేసిన తీరుకు నిరసనగా మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయం ఎదుట శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, నాయకులు నర్సింహారావు, శ్రీనివాస రెడ్డి, మోహన్‌రావు, పిచ్చిరెడ్డి, కృష్ణారావు, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.



ఎర్రుపాలెంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లారీ యజమానుల నిరసన



ఆందోళన చేస్తున్న లారీ యజమానులు

సత్తుపల్లిటౌన్: లోడింగ్, కిరాయిలు పెంచాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లి ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యజమానులు స్థానిక కిస్లే ఫ్యాక్టరీ గేట్లు మూసేసి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. లోకల్ లారీలకు లోడింగ్, కిరాయిల కేటాయింపులో అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 8 గంటలకు లోడింగ్ కోసం వచ్చిన లారీలకు సాయంత్రం 4 గంటలకు ఇస్తున్నారని, అప్పటి వరకు తిండి తిప్పలు లేకుండా పడిగాపులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా స్థానిక లారీ యజమానులు ఇబ్బందులు పడుతున్నా.. యాజమాన్యం మొండి వైఖరీతో వ్యవహరిస్తుందన్నారు. అనంతరం సాయంత్రం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదేశాల మేరకు యాజమాన్యం సహకరిస్తామని హామీ ఇవ్వడంతో లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆందోళన విరమించింది. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు జి.సర్వేశ్వరరావు, ఎస్‌కే.మౌలాలీ, రావి నాగేశ్వరరావు, పీఎల్ ప్రసాద్, లారీ యజమానులు పాల్గొన్నారు.

సభాస్థలిని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

వైరా/కారేపల్లి: వైరాలో ఆదివారం జరగనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర, బహిరంగ సభ ఏర్పాట్లను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా పీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ వైరాలో ఆదివారం పాదయాత్ర నిర్వహించిన అనంతరం బహిరంగ సభ ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి తదితరులు పాల్గొంటారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు మానుకొండ రాధాకిషోర్, కట్ల రంగారావు, నున్నా రామకృష్ణ, పోటు లెనిన్, కట్ల సంతోష్, ధరావత్ బాబు, తదితరులు పాల్గొన్నారు. కాగా, సభను విజయవంతం చేయాలని కోరుతూ కారేపల్లి మండలం రావోజీతండా తదితర గ్రామాల్లో ప్రచారం చేయగా రామ్మూర్తినాయక్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, ముస్తఫా, తలారి చంద్రప్రకాశ్, ధరావత్ భద్రునాయక్, వాంకుడోతు గోపాల్ నాయక్, గడ్డం వెంకటేశ్వర్లు, బానోతు రవి, వాంకుడోతు రవి, మోహన్, నర్సింహారావు పాల్గొన్నారు.



వైరా : సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేశానికే ఆదర్శం.. కంటి వెలుగు



కంటి వెలుగును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ లత

మధిర: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత కోరారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం 17వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వరరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు కంటి చూపు లేక ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోలేని వారికోసం ప్రత్యేకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామాల్లో పరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలను అందించారు. కార్యక్రమంలో కమిషనర్ అంబటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మధిర: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్మీడియట్ చదువుకునే ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానిక హనుమాన్ కాలనీలో నివసిస్తున్న పాపయ్య అనే విద్యార్థి మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. శుక్రవారం స్థానిక సుశీల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసి తన స్కూటీపై స్నేహితుడిని ఎక్కించుకొని ఇంటికి వెళుతున్నాడు. ఎదురుగా వచ్చిన పాలవ్యాన్ ఢీకొట్టడంతో వారికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న పాపయ్యకు తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం స్థానిక వైద్యులు విజయవాడకు రిఫర్ చేశారు.

మోటమర్రిలో మిర్చి చోరీ

బోనకల్: మండలంలోని మోటమర్రి గ్రామానికి చెందిన గోవిందరావు అనే రైతుకు చెందిన మిర్చిని చేను దగ్గర కల్లంలో ఆరబోశాడు. గుర్తు తెలియని దుండగులు 15 క్వింటాల మిర్చిని శుక్రవారం అపహరించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఎస్సై కవిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

పోషణ మాసోత్సవాలపై అవగాహన

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించి పల్లెల్లో ర్యాలీ చేశారు. పరిశుభ్రత, హ్యాండ్ వాష్ తదితర అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చిన్నారులకు వైద్య సీహెచ్‌సీ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. పలు చోట్ల చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. పలు చోట్ల విద్యార్థులకు ఈ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. **– సాక్షి నెట్‌వర్క్**



సత్తుపల్లిరూరల్: కిష్టాపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ మల్లీశ్వరి

క్షయ నివారణ అందరి బాధ్యత

ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని మండలాల్లోని పీహెచ్‌సీ, పారామెడికల్ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తూ.. టీబీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధిపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని, పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. **– సాక్షి నెట్‌వర్క్**



మధిరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తల్లాడలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ



ఏన్కూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం